క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

మూసాపేట: గౌడ రమేష్ ఈఎన్‌టీ ఆస్పత్రి సహకారంతో శనివారం భరత్‌నగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలనికోరాఉ. ఈ శిబిరంలో 120 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌడ రమేష్ ఈఎన్‌టీ ఆస్పత్రిబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గౌడ రమేష్, డాక్టర్ హాసిని, ప్రకాష్‌రావు, మేనేజర్ శ్రీధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులపరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కుమ్మరి బస్తీలో రూ.9లక్షల నిధులతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టిత్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీకమిటీ అధ్యక్షుడు ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో అన్నదానం

అమీర్‌పేట: రాయల సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి. కుమార్ తెలిపారు.ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, సహాయకులకు శనివారం భోజనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా నిరుపేద ప్రజలు వస్తుంటారని దీంతో సంస్థ ప్రతినిధుల సహకారంతో ప్రతి నెల ఒక్కో ఆసుపత్రిని ఎంచుకుని 300 మందికి భోజనాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

యువకుడి అదృశ్యం

అమీర్‌పేట: హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై జీవానందం వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన సాయికృష్ణ (22) ఎస్ఆర్‌నగర్‌లోని ఓ సంస్థలో పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు.ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోదరుడు శివ కల్యాణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయికృష్ణతో పాటు పనిచేసే ఓ సహోద్యోగితో విభేదాలున్నాయని, సాయికృష్ణ అదృశ్యం వెనుక ఆతని హస్తం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నేడు అనఘా వ్రతం

సనత్‌నగర్: జ్యేష్ఠ మాసం బహుళ అష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం అనఘా వ్రతం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలన్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

బన్సీలాల్‌పేట్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ నెల 11 ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో పర్యటిస్తారని స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బైబిల్ హౌస్ రైల్వే ట్రాక్ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.35, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 50, దొండ 23, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 38, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నాణ్యత లేని పనులు

- ఐదారు నెలలకే దెబ్బతింటున్న రోడ్లు, నాలా శ్లాబులు
- సుమారు రూ.2కోట్ల నిధులు మట్టిపాలు

ఆల్విన్‌కాలనీ: అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజా సొమ్ము దుర్వినియోగం తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోతున్నాయి. నూతనంగా చేపడుతున్న నిర్మాణ పనులు, మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కృషితో సుమారు రూ.2కోట్ల నిధులతో కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ, తులసీనగర్‌లో ఓపెన్‌నాలా, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు. నిర్మాణ పనులు చేపట్టి సుమారు ఆరు మాసాలు కూడా గడవక ముందే రహదారి పగిలిపోయి పెచ్చులూడి గుంతలమయంగా మారిపోతోంది.

◆ అదే విధంగా ఓపెన్‌నాలా శ్లాబులతో పాటు గోడలు కూడా దెబ్బతిన్నాయి. తూతూమంత్రంగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా బండరాయి పౌడర్‌తో సిమెంట్‌లో తక్కువ పరిమాణంతో నిర్మాణం చేయటంతో నాలా గోడలు కూడా బీటలు వారి పగిలిపోతున్నాయి. ఓపెన్‌నాలాపై శ్లాబు ఐరన్, సిమెంట్‌తో కూడిన బిల్లలు ఏర్పాటు చేయాల్సింది పోయి నాపరాళ్లు ఏర్పాటు చేయటంతో అవికూడా పగిలిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కాసులకు కక్కుర్తి పడి నాణ్యతలేని మెటీరియల్ వాడటంతో నిర్మాణాలు త్వరగా కుప్పకూలుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ రహదారులు, ఓపెన్ నాలాపై నిర్మాణం చేపట్టిన ప్రాంతాల్లో వాటర్ క్యూరింగ్ కూడా చేయకపోవటంతో అవి త్వరగా దెబ్బతింటున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. మౌలిక వసతులు కల్పించేటప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షించి ప్రజా సొమ్ము దుర్వినియోగం కాకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టవలసింది పోయి పూర్తిగా కాంట్రాక్టర్‌లకే అప్పగించటంతో అవి కాస్తా త్వరగా దెబ్బతింటున్నాయి.

◆ రహదారులను నిర్మించిన తరువాత కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వాలంటే థర్డ్ పార్టీ ద్వారా నాణ్యతా ప్రమాణాలు చెక్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. వారు కూడా కాంట్రాక్టర్‌ల మత్తులో నాణ్యత గురించి పట్టించుకోకపోవటంతోనే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకొని ప్రజా సొమ్ము దుర్వినియోగం కాకుండా సమస్య పునరావృత్తం కాకుండా తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





తులసీనగర్‌లో ఇటీవల వేసిన నాణ్యత లేని రోడ్లు, మ్యాన్‌హోల్స్‌పై వేసినపై కప్పులు



కేంద్రమంత్రిని కలిసిన కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నెహ్రూ, యువకేంద్ర భారత ప్రభుత్వ రంగారెడ్డి జిల్లా అధికారి ఐజయ్యలను శనివారం బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కో–ఆర్డినేటర్ కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు. జిల్లా స్థాయిలో జరిగే యువ ఉత్సవ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని కోరారు. అదే విధంగా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లకు సంబంధించి కూడా అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకొనే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడానని చెప్పారని కుమార్‌యాదవ్ తెలిపారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న కుమార్‌యాదవ్

కొత్త జిల్లాల ఏర్పాటుతోనే సుపరిపాలన



• మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నూతనంగా జిల్లాలు ఏర్పడిన తర్వాతనే ప్రజలకు మంచి పాలన అందుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించేందుకు ఆయా శాఖలను పునర్వ్యవస్థీకరించి, సిబ్బందితో పాటు అధికారాలు, అవసరమైన నిధులు అందజేస్తూ బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని అన్నారు. 2016 అక్టోబర్ 11న నూతన జిల్లాగా ఏర్పాటు చేశారని అప్పటి నుంచి అన్ని రంగాల్లో రాష్ట్రంలో మేడ్చల్ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలలో రూ.69 కోట్లతో అభివృద్ధి చేశామని, ఇది ఎంతో ఆనందకరమైన విషయమని మల్లారెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి,జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జడ్పి సీఈఓ,దేవా సహాయం పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ కంపెనీల ఆర్థిక నేరాలు అరికట్టాలి

పంజగుట్ట: చిట్‌ఫండ్ కంపెనీల ఆర్థిక నేరాలు అరికట్టాలని, రాష్ట్ర స్థాయి చిట్‌ఫండ్ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ రైతు సంఘం నాయకురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్షర చిట్‌ఫండ్స్, కనకదుర్గ చిట్‌ఫండ్స్ బాధితులతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చిట్‌ఫండ్ కంపెనీలకు ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇస్తుందని దీంతో వారు సామాన్యులకు నిద్ర లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీటీదారులు కట్టిన సొమ్మును వారికి తిరిగి ఇవ్వకుండా షూరిటీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ వారి సొమ్మును రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వాడుకుని లక్షలు గడిస్తున్నారని ఆరోపించారు. చాలా మంది చీటీలు వేసిన తర్వాత వారివద్దే డిపాజిట్లు పెట్టుకుని నెలనెలా వడ్డీ ఇస్తామంటూ ఆశచూపి చివరకు వారికి చుక్కలు చూపిస్తున్నారన్నారు. డబ్బులు కావాలని గట్టిగా అడిగితే తమదే రియల్ ఎస్టేట్ సంస్థ ఉందని అందులో ఫ్లాట్ కొనుగోలు చేయండని అంటూ ఆరు వేలకు గజం ఉన్న చోటు 15 వేలకు గజం చొప్పున అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాధితులు రవీందర్, కిశోర్, అరుణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేస్తున్న జయేష్ రంజన్ తదితరులు

పంజగుట్ట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐటీ శాఖ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. శనివారం నక్లెస్‌రోడ్డు కూడలిలో కె.సీ పుల్లయ్య ఫౌండేషన్ (కేసీపీ ఫౌండేషన్) ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పర్యావరణ శాఖ, యునైటెడ్ నేషన్ ఎన్విరాలిమెంట్ ప్రోగ్రాం (యూఎన్‌ఈ) సహకారంతో ×ఐ యామ్ ఎ సాల్వేజర్¥ పేరుతో ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై ఉన్న ప్లాస్టిక్‌ను ఎవరు ఎక్కువ సేకరించారో మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి వివిధ కాలేజీలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై ఆటపాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా డివైన్ మిస్ ఎర్త్ తేజస్వీ మనోజ్ఞ విద్యార్థులు, అతిథులచే ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్ మాట్లాడుతూ .. ప్రస్తుతం ప్లాస్టిక్ సమస్య తీవ్రంగా మారిందని సరదా కోసం మనం హుస్సేన్‌సాగర్ వైపు వస్తే ఎన్నో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తాయని అదిచూస్తే బాధ కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే కర్మాగారాలు మన వద్ద చాలా ఉన్నాయని తాను కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో చేసిన బూట్లు వేసుకుని కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. డివైన్ మిస్ ఎర్త్ తేజస్వీ మనోజ్ఞ మాట్లాడుతూ.. మనం ఉదయం లేచినప్పటి నుంచీ రాత్రి వరకు ప్లాస్టిక్ వాడుతూనే ఉన్నామని మనం వాడిని ప్లాస్టిక్‌లో కేవలం 10 శాతం మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్నామని మిగిలిన మొత్తం భూమిలో కలిసి పోతుందని ఇది ఎంతో ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో కేసీపీ ఫౌండేషన్ ఛైర్మన్ అనీల్‌కుమార్, శ్రీదత్త ఇనిస్ట్యూషన్స్ ఛైర్మన్ పాండురంగా రెడ్డి, వైస్ ఛైర్మన్ వైభవ్ రెడ్డి, లోటస్ ల్యాబ్ స్కూల్ ఛైర్మన్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి శ్రీరంగనాయకస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల్లోభాగంగా గరుడ ధ్వజారోహణం, సంతాన ప్రసాద పంపిణీ, హోమాలు వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈనెల 12వ తేదీన రంగనాయకస్వామి కల్యాణం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

హష్ ఆయిల్ విక్రేత అరెస్టు

రహమత్‌నగర్: హష్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ వాసుదేవ రావు వివరాల ప్రకారం.. గురుద్వార్‌కమాన్, యాదగిరినగర్‌కు చెందిన రవి(19) హష్ ఆయిల్ విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి రవిని అదుపులోకి తీసుకున్నారు. 25గ్రా. హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బీసీ-ఏలో ఎవరిని కలిపినా సహించేది లేదు

పంజగుట్ట: బీసీ–ఏ గ్రూపులో ఏ కులాన్ని కలిపినా సహించేది లేదని బీసీ–ఏ గ్రూపులో ఉన్న కులాలన్ని ఐక్యమై రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతి ఏ–గ్రూపు హక్కుల పరిరక్షణ సమితి హెచ్చరించింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం.బాగయ్య, ఎ.బాలయ్య, హరికృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం ముదిరాజ్ కులస్తులను బీసీ–ఏ లోకి మార్చాలని కుట్ర జరుగుతుందని, అంతే కాక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన 26 కులాలను బీసీ–ఏ నుంచి తొలగించారని వారిని మళ్లీ బీసీ–ఏ లో కలిపేందుకు చూస్తున్నారని ఇది అన్యాయమన్నారు. వారిని బీసీ–ఏలో కలిపితే తమను ఎస్సీ లేదా ఎస్టీలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గడప శ్రీహరి, చంద్రప్రకాష్, రామ్ చందర్, మహాలింగం, గణేష్ పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేద్దాం

సనత్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల అధ్యక్షులుగా కన్నూరి క్రాంతికుమార్, నక్క శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి గడప గడపాకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు.

భట్టియాత్రకు ఓయూలో సంబురాలు

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర వేయి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓయూలో సంబరాలు జరిపారు. శనివారం విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు లోకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట బాణాసంచా కాల్చి, కేక్‌కట్ చేశారు. అనంతరం భట్టియాత్రకు సంఘీభావంగా దేవరకొండకు బస్సుయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో చనగాని దయాకర్, విజయ్‌కుమార్, శ్రీహరి, దుర్గం భాస్కర్, శ్రీనివాస్, రాంచంద్రయ్యయాదవ్, రాథోడ్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో జరిగే ఈ సమావేశానికి కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని మంత్రి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఘనంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ గురుమూర్తి నగర్‌లోని వినాయక స్వామి దేవాలయంలో నవనాగుల యంత్ర, విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నవనాగుల పంచామృతాభిషేకములు, ప్రతిష్ఠా దేవతల యొక్క శాంతి పూర్వక హవనం, పూర్ణాహుతి నీరాజన మంత్ర, వేద ఆశీర్వచన పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.నరేందర్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పూజలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు కూతురు నర్సింహ, కట్ట బల్‌రాం, షాబాద్ సత్యనారాయణ, కనకదుర్గా దేవి ఆలయ సూపరింటెండెంట్ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా గడపగడపకు బీజేపీ



సమతానగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు



కాలనీల్లో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రాబోయో ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీజెపి పార్టీ గెలుపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామనిసీనియర్ నాయకులు వడ్డేపల్లి శరస్‌కుమార్ చౌదరి తెలిపారు. శనివారం గడప గడపకు బీజేపీపాదయాత్రలో భాగంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోనిపర్యటించారు. హెచ్‌ఏఎల్ పార్కు, సమతానగర్‌లో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శరస్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ... డబల్ బెడ్‌రూమ్స్‌ఇళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ప్రజలకు కనీస మౌలిక సదుపాయులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. అధికార పార్టీకి చెక్ పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, మేడ్చల్‌అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, శ్రీకర్‌రావు, సూర్యరావు, తిరుపతి యాదవ్, సంతోష్‌యాదవ్, సత్యనారాయణ, రవికుమార్‌గౌడ్, లక్ష్మి, సాయి, ఎస్‌కే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: గాయత్రినగర్‌లో రూ.85లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సున్నం చెరువు పార్కు అభివృద్ధి పనులు, రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీనియర్ సిటిజన్ కమిటీ హాలు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పార్కులు, కమ్యూనిటీహాల్‌లు భారీ నిధులతో పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాశీనాథాచారి, వెంకటేశ్వర్లు, మాధవాచారి, రవీందర్‌రెడ్డి, యోగిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లను వినియోగించుకోవాలి

పంజగుట్ట: ప్రతి ఒక్కరూ కమ్యూనిటీ హాళ్లను ఉప యోగించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రేమ్‌నగర్ కమ్యూనిటీహాల్ మూడవ అంతస్తును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి పథకాల కింద పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారు ఆర్థికంగా ఎదిగేలా కమ్యూనిటీహాల్‌ను ఉపయోగించుకోవాలన్నారు.